www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 మార్చి 2023

5

పశ్చిమ గోదావరి



ఎంఆర్‌కెలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - వీరవాసరం

స్థానిక ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని సబ్బారపు వెంకట్రావు, కమల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. ఉగాది పండుగ విశిష్టతను సంస్కృత ఉపాధ్యాయుడు చిలుకూరి ఫణికుమార్ వివరించారు. తెలుగు ఉపాధ్యాయుడు పంపన సాయిబాబా ఉగాది కవితలు విన్పించారు. అనంతరం వస్త్రధారణ పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.ప్రభావంజలి, సబ్బారపు వెంకట్రావు, స్కూల్ ఛైర్మన్ చుండూరి ముసలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదంతొక్కిన ఆశాలు

సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా
వందలాదిగా తరలొచ్చిన ఆశా కార్యకర్తలు
అధికారుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయింపు
ఆందోళనలో సొమ్మసిల్లిన జిల్లా నేత లారెన్స్‌కుమారి
సమస్యలు పరిష్కారానికి వైద్య శాఖాధికారులు హామీ
వారం రోజుల్లో జాయింట్ కమిటీ వేయకపోతే ఉద్యమం ఉధృతం
ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ



ధర్నాలో పాల్గొన్న ఆశాలు, మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు కదంతొక్కారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం చేపట్టిన ధర్నాకు ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొని వందలాది మంది ఆశాలు తరలొచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేసిన నినాదాలతో కలెక్టరేట్ హోరెత్తింది. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, రికార్డులు ప్రభుత్వమే అందించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పిహెచ్‌సిల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు డిమాండ్లపై నినదిస్తూ నిరసన తెలిపారు. ఆశాలపై అధికారుల వేధింపులు ఆపండి, తమ సమస్యలపై జాయింట్ యాక్షన్ కమిటీ వేసి వెంటనే పరిష్కరించండి అంటూ నినాదాలు చేశారు. అయితే గంటలు తరబడి ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో ఆశాలు, సిఐటియు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎంహెచ్ఒ వచ్చి సమస్యలు విని వినతిపత్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే డిఎంహెచ్ఒ కార్యాలయానికి రాలేదని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆశాలు, సిఐటియు నేతలు కలెక్టరేట్ వద్దకు



మాట్లాడుతున్న అడిషనల్ డిఎంహెచ్ఒ భానునాయక్

చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరుపక్షాల నడుమ వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో అంతా అక్కడే బైఠాయించారు. వైద్యఆరోగ్య శాఖాధికారుల తీరుపై నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి సమాధానం చెప్పే వరకూ కదిలేది లేదని అక్కడే బైఠాయించారు. వన్‌టౌన్ సిఐ శ్రీను జోక్యం చేసుకుని జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖాధికారిని రప్పించారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, జిల్లా కార్యదర్శి డి.జ్యోతి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి, సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్ జిల్లా అధికారులకు సమస్యలు వివరించారు. వారం రోజుల్లో జాయింట్ యాక్షన్ కమిటీ వేసి అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖాధికారి భానునాయక్ హామీ ఇవ్వడంతో ఆశాలు ఆందోళన విరమించారు.




హామీ అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ

ఆశాల సమస్యల పరిష్కారానికి వారం రోజుల్లో జాయింట్ కమిటీ వేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ హెచ్చరించారు. దిగువస్థాయిలో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల దగ్గర నుంచి పనిభారం, వేధింపులు వంటి అనేక రకాల కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు కనీసం తెలుసుకునేందుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడం బాధాకరమన్నారు. శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు డి.కళ్యాణి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. చాలీచాలని వేతనాలతో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోవడం చట్ట విరుద్ధమన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శులు ఎం.ఆంజనేయులు, అల్లూరి అరుణ్ మాట్లాడుతూ కార్మిక చట్టాల్లో ఏ ఒక్కటీ స్కీమ్ వర్కర్లకు అమలు కావడం లేదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశాల పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతపల్లి లక్ష్మి, దిగుబాటి జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో ఆశాల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తున్నామని, అయితే సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లారెన్స్ కుమారి, డి.వరలక్ష్మి, బేగం, శ్రీవర్ధిని, దేవి, అమ్మాజీ, రమాదేవి, రత్నకుమారి, ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నాలో స్పృహ కోల్పోయిన లారెన్స్ కుమారి

ఆశాల ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి లారెన్స్‌కుమారి ఒకసారిగా స్పృహ కోల్పోయారు. ఈ నేపథ్యంలో సిఐటియు, యూనియన్ నేతలు ఆమెను హుటాహుటీన ఆటోలో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లారెన్స్‌కుమారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెప్పారు. చికిత్స పొందుతున్న లారెన్స్ కుమారిని సిఐటియు, యూనియన్



లారెన్స్ కుమారిని పరామర్శిస్తున్న నేతలు

నాయకులు, పలువురు ఆశా కార్యకర్తలు పరామర్శించారు.

తాడేపల్లిగూడెం: ఆశాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సంబంధం లేని ఇతర పనులు చేయించరాదని కోరుతూ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశాలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నానుద్దేశించి సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, ఆశాల నేత సత్యవాణి, సిహెచ్.వరలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను, ఆశాల నేత సిహెచ్.వరలక్ష్మి, ఎస్.విజయలక్ష్మి, కె.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



రాగి జావ పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

త్వరలో రేషన్‌కార్డుదారులకు రాగులు, జొన్నలు

రాగి జావ పంపిణీ ప్రారంభ సభలో మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అత్తిలి

రాబోయే కాలంలో రేషన్‌కార్డుదారులకు రెండు కిలోల బియ్యం తగ్గించి రాగులు, జొన్నలు కిలో చొప్పున పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బాలికల హైస్కూల్లో ఇన్‌ఛార్జి ఎంఇఒ డి.శారదా జ్యోత్న్స ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు సిఎం జగన్ గోరుముద్ద కార్యక్రమంలో రాగిజావను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ బంధువులకు ఇంగ్లీష్ మీడియం చదువులు కావాలని, రాష్ట్రంలోని విద్యార్థులకు మాత్రం ఇంగ్లీషుమీడియం వద్దంటున్నారని విమర్శించారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నానని, ఇప్పటి సౌకర్యాలు అప్పుడుంటే కలెక్టర్ స్థాయికి ఎదిగే వాడినని అన్నారు. ఎంఎల్‌సిగా ఎన్నికైన వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలన్నారు. డిఇఒ ఆర్.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత పూర్తిగా నిర్మూలించేందుకు రాగి జావ దోహద పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి సర్పంచి గంటా విజేత, ఎంపిపి మక్కా సూర్యారావు, జెడ్‌పిటిసి అడ్డాల జానకి, ఎఎంసి ఛైర్మన్ బుద్దరాజు భవానిప్రసాద్, ఎంపిడిఒ వివిఎస్.రామారావు, తహశీల్దార్ రామాంజనేయులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

భీమవరం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం విద్యార్థులకు పోషకాలతో కూడిన రాగి జావ అందిస్తుందని ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం జగన్ రాగి జావ పంపిణీని ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇన్‌ఛార్జి జెసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 1382 పాఠశాలల్లో లక్షా 16 వేల 727 మంది విద్యార్థులు రాగిజావను పొందుతారన్నారు. వారానికి మూడు రోజులు, రోజు విడిచి రోజు చిక్కిలేని రోజుల్లో మాత్రమే విద్యార్థులకు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, మధ్యాహ్నం భోజనం జిల్లా కోఆర్డినేటర్ కె.కృష్ణారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, విద్యాశాఖ ఎడిలు ఎస్ఎల్.నరసింహ, ఇవి.నారాయణ, ఎం.సుధాకర్, డివైఇఒ శ్రీరామ్, ఎంఇఒ బి.వినాయకుడు పాల్గొన్నారు.

పోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. కొమ్ముచిక్కాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులంతా శ్రద్ధగా పబ్లిక్ పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, నేతలు గణపతి రాజు, గుంటూరి చంటిరాజు, నాగరాజు బాలాజీరాజు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



నినదిస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

ప్రజాఉద్యమాలపై నిర్బంధాలను తిప్పికొట్టాలి : సీతారాం

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం విధించినా రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి సీతారాం మాట్లాడుతూ ప్రజాందోళనలు, ఉద్యమాలను నియంత్రించేందుకే జిఒ నెం.1 తీసుకొచ్చారని విమర్శించారు. చలో విజయవాడకు పిలుపునిస్తే అక్రమంగా అరెస్టులు చేశారు. అంగన్వాడీల విషయంలో ఎక్కడికక్కడ నిర్బంధించి, అమానుషంగా వ్యవహరించారన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి జిఒ నెం.1ని రద్దు చేయాలని, లేనిపక్షంలో జిఒ రద్దయ్యే వరకూ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రధానంగా ఉద్యాన పంటలు, కూరగాయ పంటలు, అరటి తోటలు, కొన్ని చోట్ల వరి దెబ్బతిన్నాయన్నారు. ఈ నష్టాలను తక్షణం అధికారయంత్రాంగం నమోదు చేసి ఆయా రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. చాలాచోట్ల సాగునీటికి ఎద్దడి ఏర్పడిందన్నారు. పేరెమో గోదావరి జిల్లా, గోదావరిలో జలాలున్నా చాలా ప్రాంతాల్లో వరి చేలకు నీరందక ఎండిపోతున్నాయన్నారు. రైతాంగానికి ఇబ్బంది లేకుండా పంటలు నష్టపోకుండా సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాలో జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని కోరారు. కాలనీల్లో రోడ్లు, లైట్లు, డ్రెయినేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు వెంటనే స్వాధీనం చేయాలని కోరారు. కట్టిన డిపాజిట్‌లకు వడ్డీలు కట్టలేకపోతున్నారని, అద్దె ఇళ్లలో ఉండలేకపోతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో ప్రజా సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, చింతకాయల బాబూరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, నేత జుత్తిగ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

కలెక్టరేట్లో వర్క్ టూ రూల్

కార్యాలయానికి తాళాలు వేసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం కలెక్టరేట్లో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం వర్క్ టూ రూల్ పాటించారు. ఉదయం పదిన్నర గంటలకు విధులకు హాజరైన ఉద్యోగస్తులు సాయంత్రం ఐదు గంటలకు విధులను విరమించారు. కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చుతుందని హెచ్చరించారు. సిపిఎస్‌ను రద్దు చేసి డిఎ బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో హెచ్‌ఆర్‌ఎ 16 శాతం ఇవ్వాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను ఎటువంటి షరతులూ లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. ఇతర పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని పెండింగ్ డిఎలను ఉగాదికి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, నిజాముద్దీన్‌షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, జి.కళ్యాణి, పి.గౌతమి, సాంబశివరావు, డిటి.సూర్యనారాయణరాజు, జూనియర్ సహాయకులు స్మైలీ దివ్య, సాయి, జీవన్, సుభాష్, రమా, సిబ్బంది బుజ్జియ్య, సూర్యకాంతం, అనురాధ, మురళీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి -భీమవరం



కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా ప్రజలందరికీ శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది నుండి ప్రజలందరీ సంకల్పాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. అద్భుత విజయాలను సాధించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటు న్నానని పేర్కొన్నారు.

చంద్రబాబు, లోకేష్ జైలుకు వెళ్లడం ఖాయం

మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి లోకేష్ జైలుకు వెళ్లడం ఖాయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే ఈ అవినీతి జరిగిందని, రూ.370 కోట్లు డొల్ల కంపెనీలకు దోచిపెట్టారని అన్నారు. కేబినెట్లో ఒక్క లెటర్‌తోనే ఈ నిధులు ఆమోదించారని చెప్పారు. పూర్తి ఆధారాలతోనే సిఎం జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారని అన్నారు. మూడు ఎంఎల్‌సిలు గెలుపొందినందుకే టిడిపి సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, నాయకులు చిట్టూరి సుబ్బారావు, మంగిన సూర్య, బోడపాటి వీర్రాజు, మెహర్ అన్సారీ పాల్గొన్నారు.

కొనసాగిన ఎపి సీడ్స్ హమాలీల ఆందోళన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్ హమాలీ కార్మికుల పొట్ట కొట్టే టెండర్ విధానం రద్దు చేసి, పాత పద్ధతిలో అగ్రిమెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అడ్డగర్ల అజయకుమారి, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎపి సీడ్స్ వద్ద టెండర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎపిఎస్ఎస్‌డిసి హమాలీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న హమాలీల పట్ల చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరం పొడవునా పని లేకపోయినా హమాలీలు పని చేస్తున్నారన్నారు. చాలాచోట్లకంటే తణుకులో తక్కువ రేట్లకే పని చేస్తున్నప్పటికీ అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనంతరం కార్మికులు వై.జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ, కార్యదర్శి జి.త్రిమూర్తులు, నేతలు సాంబశివరావు, రాంబాబు, వరలక్ష్మి, కృష్ణ, రూతమ్మ, శ్రీహరి, చిన్న, రమణ, బాలాజీ, సత్యనారాయణ పాల్గొన్నారు.



నినదిస్తున్న ఎపి సీడ్స్ హమాలీలు, నేతలు

అప్పారి ఆశయాలు ఆదర్శనీయం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామిని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వెంకటస్వామి వర్ధంతిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపీమూర్తి మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి 16 ఏళ్ల సర్వీసును వదిలిపెట్టి స్వచ్ఛంద ఉద్యోగవిరమణ చేసి యుటిఎఫ్‌ను ఉమ్మడి రాష్ట్రంలో బలమైనదిగా తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ వెంకటస్వామి ఆశయాలను నేటితరం ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకొని పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ జివి.రామానుజరావు మాట్లాడుతూ సంఘం ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరు వెంకటస్వామి అని అన్నారు. వర్ధంతి సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నేతలు

నిర్బంధాన్ని నిరసిస్తూ ఐలు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

పోలీసుల అక్రమ నిర్బంధాలను ఆపాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసుల వ్యవహార శైలిని నిరసిస్తూ మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఐలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ నెం.1ని రద్దు చేయాలని కోరతూ ఈ నెల 20న చలో అసెంబ్లీ పిలుపులో భాగంగా యూనియన్ నాయకులు బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పళ్ల సుబ్బారావు, సుంకర రాజేంద్రప్రసాద్, ఇతర న్యాయవాదులను పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధం, పోలీసుస్టేషన్‌లో నిర్బంధం వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని అన్నారు. నల్ల చట్టాలతో ప్రజల హక్కులను హరించాలని అనుకోవడం హిట్లర్‌కే సాధ్యం కాలేదని మునిస్వామి అన్నారు. ప్రజలకు న్యాయం అందించేందుకు పని చేస్తున్న న్యాయవాదులపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాన్ని పోలీసు అధికారులు విడనాడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలీసుల వ్యవహార శైలిపై న్యాయవాదులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొల్లపల్లి అంబేద్కర్, అనుకుల రమేష్, ఎం.శ్యాంసన్, టి.సత్యనారాయణరాజు, ఎం.మృత్యుంజయరావు, డి.అప్పారావు, టి.కుటుంబరావు, వై.వెంకన్నబాబు, శ్రీనివాసు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

పన్నులు నూరుశాతం వసూలు చేయాలి : డిపిఒ నాగలత

ప్రజాశక్తి - వీరవాసరం

పన్నులు నూరు శాతం వసూలు చేయాలని డిపిఒ నాగలత పంచాయతీ అధికారులను ఆదేశించారు. వీరవాసరం పంచాయతీని మంగళవారం ఆమె సందర్శించి పన్నుల వసూళ్లపైనా, పంచాయతీకి రావాల్సిన ఇతర బకాయిలపైనా సమీక్షించారు. డిమాండ్‌కు తగ్గట్టుగా పన్నుల వసూలు చేయాలన్నారు. మార్చి నెలాఖరుకు పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేసేలా కార్యాచరణ అమలు చేయాలని కార్యదర్శి ప్రసాద్‌ను ఆదేశించారు.

మంచి అలవాట్లతో రోగాలు దూరం

ప్రజాశక్తి - పాలకోడేరు

మంచి అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా కొన్ని రోగాలను దూరం చేసుకోవచ్చని పాలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ స్వర్ణ నిరంజని తెలిపారు. మంగళవారం గొరగనమూడి గ్రామంలో హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌ను గొరగనమూడి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో, 104 సిబ్బంది నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వర్ణ నిరంజని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో 104 వైద్యుడు సూర్యనారాయణ రాజు, సూపర్‌వైజర్లు శంకర్, చండీరాణి ఎంఎల్‌హెచ్‌పి రోమోలా, ఎఎన్ఎం వేదకుమారి, ఆరోగ్య సహాయకుడు ఎం.విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు యువత గ్రామ కమిటీ నియామకాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో అన్ని గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో తెలుగు యువత గ్రామ కమిటీ అధ్యక్ష నియామకాలు చేపట్టినట్లు తెలుగు యువత మండల అధ్యక్షులు కేతా మురళి తెలిపారు. మంగళవారం వల్లూరులో తెలుగు యువత గ్రామ కమిటీ అధ్యక్షులుగా శీలం శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిటి దిగమర్తి సూర్యకుమారి, సర్పంచి నేలపూడి బేబీ రామ్మోహనరావు, ఎంపిటిసి తాతం శ్రీను సుబ్బారావు, నాయకులు అభినందించారు.

ఆలయ పునఃనిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని బలుసుమూడిలో మావుళ్లమ్మను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఉన్నప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి తన వంతుగా రూ.రెండు లక్షలు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఆయన వెంట రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రెండో పట్టణ జెసిఎస్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు తాతరాజు ఉన్నారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పాలకొల్లు

821వ రోజు అన్నా క్యాంటీన్ వద్ద నారా లోకేష్, బ్రాహ్మణి కుమారుడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పేదలకు అన్నదానం చేశారు. ముందుగా టిడిపి నేతలు కేకును కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

వర్షపు నీటిని ఒడిసి పట్టాలని ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.రాజేశ్వరి తెలిపారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎవిఎ రంగారావు హాజరై మాట్లాడారు. నీటి దుర్వినియోగాన్ని నిరోధించి, నీటి విలువను తెలియజేస్తూ భావితరాలకు తాగు, సాగునీరు లభ్యంగా ఉండేలా తీసుకోవాలన్నారు. ప్రిన్సిపల్ బి.రాజారాజేశ్వరి మాట్లాడారు. సమస్త జీవకోటికి ప్రాణాధారం జలం అన్నారు. నీరు లేకుంటే జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమన్నారు. కార్యక్రమంలో వంశీ, ఐక్యూఎసి సమన్వయ కర్త జి.శ్రీనివాస్, జగపతిబాబు పాల్గొన్నారు.

నేడు పాలకొల్లులో కవి సమ్మేళనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్, రసధుని సంయుక్త ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదిన సందర్భంగా ఈ నెల 22వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు, క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ వీరుభొట్ల కుటుంబ సత్యనారాయణచే పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం, కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి పెన్మెత్స వర్మ చెప్పారు. ఈ సమ్మేళనంలో కవులు మామిడిశెట్టి శ్రీనివాస్, చేగొండి రంగారావు, పోశింశెట్టి సత్యశ్రీ, ఎస్.కె.నాగేశ్వరరావు, ఏడిద రవీంద్ర, కోలాటి పెద్దిరాజు, వేగేశ్న వెంకట సత్యనారాయణరాజు, పిఎస్‌వి.శ్రీదేవి, గాదరాడ రవిచంద్ర, మంతెన శ్రీను పాల్గొంటారని చెప్పారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఏప్రిల్ మూడో తేదీ వరకూ జరిగే పోషణ పక్వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజబెత్ అన్నారు. మంగళవారం మొదటి రోజు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సూపర్‌వైజర్లతో ర్యాలీ నిర్వహించి కార్యక్రమం షెడ్యూల్‌ను కార్యకర్తలకు వివరించారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి క్రమం తప్పకుండా ప్రతి సెంటర్‌లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగల్తూరు : పోషకాహారం తీసుకుంటే అంతా ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఉర్మిళ సూచించారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా గ్రామంలో అంగన్‌వాడీలు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. పోషకాహార పక్షోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి ఏప్రిల్ మూడో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్‌ఎన్ ఆనంద్‌కుమార్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వీరవాసరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల 20న ప్రారంభమైన కార్యక్రమం ఏప్రిల్ 3వ తేదీ వరకూ కొనసాగుతుంది. ఈ సందర్భంగా అవరాలు, తృణధాన్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించి వాటి ఉపయోగాలను పిల్లల తల్లులకు, కిశోర్ బాలికలకు వివరించారు.

కోరుకొల్లులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకోడేరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వికృత చేష్టలతో రాష్ట్ర ప్రజలు రాష్ట్రానికి ఇదేం ఖర్మ రాబాబు అంటూ తలలు పట్టుకుంటున్నారని టిడిపి మండల సీనియర్ నాయకుడు గజరాజు శ్రీనివాసరాజు అన్నారు. కోరుకొల్లు గ్రామంలో ఎంఎల్‌సి రామారావు సూచనలతో మంగళవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట భాస్కరరాజు, మధుసూదన్‌రాజు, గాడి ధామస్, గేదెల రమణ వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

పుస్తక పంపిణీ కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పోడూరు

శాఖా గ్రంథాలయాల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న పుస్తక పంపిణీ కేంద్రాలను ఆయా గ్రామాల విద్యార్థులు, యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పుస్తక పంపిణీ కేంద్రాల తనిఖీ అధికారి కెజిఎస్‌ఎల్.కుమారి అన్నారు. జిన్నూరు శాఖా గ్రంథాలయ పరిధిలోని వేడంగి పుస్తక పంపిణీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. పుస్తక పంపిణీ కేంద్రాలకు మరింత ఎక్కువ మంది పాఠకులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాలకొల్లు, జిన్నూరు శాఖా గ్రంథాలయాల పరిధిలోని పుస్తక పంపిణీ కేంద్రాలను తనిఖీ చేశారు.

విద్యార్థులకు రాగి జావ పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతి విద్యార్థీ పౌష్టికాహార లోపాలను జయించాలంటే రాగిజావ చాలా అవసరమని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. సోమరాజు ఇల్లిందపర్రు పాఠశాలలో మంగళవారం గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సర్పంచి వనుం సూర్యనారాయణ ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఆయా గ్రామాలు ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఆచంట : పెనుమంచిలిలో రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ జగన్నాధరావు

ఆచంట : కార్పొరేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో ఉచితంగా విద్యనందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, పెనుమంచిలి, ఆచంట వేమవరం, వల్లూరు తదితర గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు సుంకర సీతారాం, దిరిశాల విజయలక్ష్మి, గణేశుల శేషవాణి సుబ్బారావు, జక్కంశెట్టి చంటి, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, ఎంపిడిఒ జగన్నాధరావు, విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు రక్తహీనత గురి కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి ఇటువంటి పథకాలు ప్రవేశపెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, తహశీల్దార్ రాజలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల్లో జగనన్న గోరుముద్దలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. వీవర్స్ కాలనీ పిఎంసి ఛైర్మన్ కొత్తల వెంకట కుమారి చేతుల మీదగా రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ రాగిజావను ప్రతి విద్యార్థి తాగేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పిఎంసి సభ్యులు, తల్లిదండ్రులు, హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు.

కాళ్ల : విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గోరుముద్ద పేరుతో రాగిజావ పంపిణీ కార్యక్రమం చేపట్టిందని జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని కోపల్లె, కాళ్ల, దొడ్డనపూడి, కలవపూడి హైస్కూల్లో రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. వారంలో మూడుసార్లు పిల్లలకు రాగిజావ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పి.శిరీష విశ్వనాధరాజు, ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ మూర్తి, కె.నిర్మలాదేవి, ఇందిర, గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని అన్ని పాఠశాలల్లో రాగిజావ పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఉప్పులూరులోని యర్రా చంద్రరావు, ఆండాలమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొల్లి సాయిరాం ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి నిమ్మల కేశవ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి ఆలయ ఛైర్మన్ యర్రా సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంటపాడు : రాగి జావ పంపిణీ కార్యక్రమం ఎంపిపి దాసరి హైమావతి మంగళవారం స్థానిక ప్రభుత్వ పోస్ట్ బేసిక్ స్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. వారంలో మూడు రోజులు రాగిజావ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి తాడేపల్లి సూర్యకళ, తహశీల్దార్ జివి.శేషగిరి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

పెనుగొండ: దేవ, ములపర్రు, ఇలపర్రు తదిరత గ్రామాల్లోని పాఠశాల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవ సర్పంచి ఎన్.సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఇలపర్రు సర్పంచి దండు పద్మావతి, ఉప సర్పంచి సాక సుబ్రహ్మణ్యం, గుడాల చిన రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : తమ ప్రభుత్వం విద్యకు, విద్యార్థుళకు విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని జెడ్‌పిటిసి వేగేశ్న వెంకటరాజు (ఎండగండి శీను) అన్నారు. విద్యార్థులకు రాగి జావా పంపిణీ కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని చినకాపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి వెంకటరాజు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి రాజ్యలక్ష్మి, వైసిపి నాయకులు అన్నవరం, పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకోడేరు : జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు), కుముదవల్లి సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. కుముదవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. విస్సాకోడేరు, గొరగనమూడి, శృంగవృక్షం గ్రామాల్లో సర్పంచులు బొల్ల శ్రీనివాస్, గొట్టుముక్కల వెంకట శివాజీరాజు, జంగం సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పొన్నమండ బాలకృష్ణ, చెల్లబోయిన పాపారావు, నరేష్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కోడిగుడ్డు, చిక్కీలు, రాగిజావ వంటి బలమైన పౌష్టికాహారం అందించడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తాడేపల్లి గ్రామ సర్పంచి పోతుల అన్నవరం అన్నారు. తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ ప్రెసిడెంట్ పరిమి తులశీదాస్‌తో కలిసి అన్నవరం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.రవిచంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు కెవిఎస్.రామాంజనేయులు, మేరీ పుష్ప పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్‌పికి గొరగనమూడి గ్రామస్తులు ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

స్వామి జ్ఞానానంద వంటి మహనీయులు పుట్టిన గ్రామంలో గ్రామస్తులంతా కలిసి మెలిసి సోదరభావంతో జీవిస్తుంటే ఓ వ్యక్తి కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని, తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని గొరగనమూడి గ్రామస్తులు కోరారు. ఒక ఛానల్ అధినేత అని చెప్పుకుంటున్న రాంబాబుపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో రాంబాబు వ్యవహరిస్తున్న తీరుపై గొరగనమూడి గ్రామస్తులంతా జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా మంగళవారం గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జిల్లా ఎస్‌పికి అందజేసిన ఫిర్యాదు పత్రాలను విలేకరులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు) మాట్లాడుతూ గ్రామంలో ఒక మహిళా వాలంటీర్‌ను అడ్డం పెట్టుకుని ఛానల్ అధినేతగా చలామణి అవుతున్న రాంబాబు ఓ ఇంటి నిర్మాణం విషయంలో జోక్యం చేసుకొని రౌడీయిజం చేసి గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెడుతున్నాడని ఆరోపించారు. ఎన్నో ఏళ్ల నుంచి గ్రామంలో అందరూ కలిసి, మెలిసి సోదరుభావంతో జివిస్తుంటే తమ మధ్య కుల భావన తీసుకొచ్చి రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఇటీవల గ్రామంలో అన్ని కులాలతో గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగిందని, రాంబాబుపై చర్యలు తీసుకునే విధంగా తీర్మానం చేసి జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశామని తెలిపారు. మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు మాట్లాడుతూ ప్రశాంతతకు మారుపేరుగా గ్రామం ఉందని, రాంబాబు అవలంబిస్తున్న తీరుతో గ్రామస్తులంతా విసుగు చెందారని తెలిపారు. తక్షణం రాంబాబుపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పివి.రావు మాల మహానాడు రాష్ట్ర నాయకులు పొన్నమండ బాలకృష్ణ, పద్మశాలిల సంఘం రాష్ట్ర నాయకులు బాల్లా పరమేశ్వరరావు మాట్లాడుతూ రాంబాబు ఒక వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్‌చేసి గ్రామంలో ఉన్న అందరిపైనా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మీడియా ప్రతినిధులు వారధిగా ఉండాలని, కానీ గ్రామంలో రాంబాబు వ్యవహార శైలి దీనికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్, దిడ్ల రవి, రామకృష్ణ, దొంగ సురేష్, మహంకాళి, బొల్లం గాంధీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌పికి ఫిర్యాదు చేసిన గొరగనమూడి గ్రామస్తులు

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉండి: ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని యండగండి పిహెచ్‌సి డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. మంగళవారం వెలివర్రు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ సరైన వైద్య సదుపాయాలు లేని గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. వెలివర్రు, గరువు ప్రాంతంలో మంచం మీద ఉన్న రోగులను పరీక్షించామన్నారు. అనంతరం అంగన్‌వాడీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచారం ఇచ్చినా సమావేశానికి రారా!

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజా ప్రతినిధులంటే చేతకాని వాలా చూసే అధికారుల తీరును సహించేదిలేదని మండల పరిషత్ సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల పరిషత్ సమావేశం అని సమాచారం ఇచ్చినా కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సభ్యులు అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. పలువురు అధికారులు సమావేశానికి రాకపోవడంతో వారి శాఖలను ప్రస్తావిస్తూ ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మి ఎంపిడిఒను నిలదీశారు. అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌ను కోరతామన్నారు. సంబంధిత శాఖాధికారులు సమావేశాలకు తప్పనిసరిగా హాజరవ్వాల్సిందేనని సభ్యులు సమావేశంలో కోరారు. సమస్యలపై అధికారులను అడుగుతున్నప్పుడు వైసిపి సర్పంచులు అడ్డుతగలడం సరికాదని, అధికారుల కంటే వైసిపి సర్పంచులు ఎక్కువ తెలినట్టు మాట్లాడుతున్నారని అధికార పక్ష సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ నిధులతో చేపట్టే పనులకు నిధులు కొరత లేదని, అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు మంజూరవుతున్నాయని పిఆర్ ఎఇ శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండటం లేదని ఎంపిటిసి విజయలక్ష్మి, మత్స్యపురిలో రెండు సంవత్సరాలుగా ఉపాధి పనులు చేపట్టడం లేదని, ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని పంచాయతీ తీర్మానం చేసినా ఇంత వరకు నియమించలేదని ఆ గ్రామ సర్పంచి కారిపల్లి శాంతిప్రియ ఉద్దేశపూర్వకంగానే ఉపాధి పనులు నిలుపుదల చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడారు. ఎంఎల్‌ఎను కలిస్తే పనులు జరుగుతాయని చెప్పడంతో ఆయన కలిసేదిలేదంటూ సర్పంచి చెప్పడంతో కొంత సేపు వాగ్వివాదం జరిగింది. కుక్కల సమస్యను పరిష్కరించాలని ఎంపిటిసి పశువైద్యాధికారి కిరణ్‌చైతన్యను కోరగా ఒక కుక్కకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలంటే రూ.500 ఖర్చువుతుందని ఖర్చును భరించడానికి పంచాయతీలు ముందుకొస్తే ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వైస్ ఎంపిపిలు అడ్డాల రాము, చిలకపాటి ప్రకాశం, ఇందిర, కొల్లేపర శ్రీనివాసరావు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు: రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారనడానికి పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలే నిదర్శనమని తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు ఎంఎల్‌సి స్థానాల్లో టిడిపి అభ్యర్థులు గెలుపొందడం హర్షణీయమన్నారు. ఎన్నికలు 108 నియోజకవర్గాల్లో జరిగాయని పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి ఇన్ని సీట్లు ఎప్పుడూ గెలవలేదన్నారు. సాధారణ ఎన్నికలకు వైసిపి ఈ ఎన్నికలను సమీఫైనల్‌గా భావించిందని అయితే ఎన్నికల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాబోయే రోజుల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు కలగర వెంకటకృష్ణ గుబ్బల శ్రీనివాస్, పితాని మోహనరావు, సాయి బాబా పాల్గొన్నారు.

పలువురికి ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా బిసి సంక్షేమ సంఘం, కోడే వీరమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో భీమవరంలో పంచారామ క్షేత్రాల్లో ఒకటైన శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో భీమవరం పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశిష్ట వ్యక్తులకు ఉగాది పురస్కారాలను మంగళవారం అందించారు. కార్యక్రమానికి కోడే వీరమ్మ సేవా సమితి అధ్యక్షులు కోడె యుగంధర్ అధ్యక్షత వహించగా, సిఐ అడబాల శ్రీను ముఖ్యఅతిథిగా విచ్చేసి సేవా తత్పరులకు సత్కారాలు అందించారు. ఈ సందర్భంగా సిఐ అడబాల శ్రీను, నిర్వాహకులు కోడే యుగంధర్ మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరం అందరికీ శుభయోగంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇంటి సత్యనారాయణ, కడలి ధర్మారావు, నల్లం రాంబాబు, గణేష్ భవాని పాల్గొన్నారు.

సర్ సివి రామన్‌లో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉగాది పండుగను పురస్కరించుకొని శృంగవృక్షంలోని సర్ సివి రామన్ పాఠశాలలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ శిరీష బాలకృష్ణ విద్యార్థులకు ఉగాది ఆవశ్యకత గురించి, ఉగాది పచ్చడి గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ఉల్లాసపర్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిలో జోనల్ మలేరియా అధికారి పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని సెంటినెల్ సర్వేలెన్స్ లాబ్ (డెంగీ వ్యాధి నిర్ధారణ లాబ్)ను జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి తనిఖీ చేశారు. అలాగే రికార్డులను పరిశీలించి లాబ్ టెక్నీషియన్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సూర్యనారాయణతో మాట్లాడారు. డెంగీ టెస్ట్ ప్రోటోకాల్ పాటిస్తూ మలేరియా నిర్ధారణ స్లైడ్ మెథడ్ చేయాలని సూచించారు. అనంతరం 33వ వార్డులోని రామాలయం సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ జూనియర్ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్ గదులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాడుకలో లేని సంపుల్లో నీటిని తోడించాలని వసతి గృహ సంక్షేమ అధికారి బి.సుజాతను ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో జోనల్ టీమ్ టెక్నికల్ మెంబర్లు ఎస్.రవిశేఖర్, ధురాని, జె.సతీష్, ఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

కొత్తపాలెంలో గొంతేరు డ్రెయిన్‌పై నిర్మిస్తున్న వంతెన పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. రూ.16.50 కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ ఇఇ ఎల్.ఏడుకొండలు, డిఇ ఎస్‌వి రమణ, జెఇ కె.ప్రసాద్‌రాజు, ప్రాజెక్ట్ డిఇ సూర్య కుమార్ పరిశీలించిన వారిలో ఉన్నారు.

వివి.గిరి కళాశాలలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - ఆకివీడు

దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత చేతి వృత్తుల నైపుణ్య శిక్షణాకేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, కళాశాల ప్రణాళిక అభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్ తెలిపారు. ఈ విభాగంలో యువతీ యువకులకు రెండు విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎయిర్ కండిషన్ ఫీల్డ్ డెకరేషన్, మహిళలకు ప్రత్యేకంగా చేతితో ఎంబ్రాయిడరీ కుట్టడం నేర్పిస్తున్నామన్నారు. రెండు, మూడు నెలల పటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కళాశాలలో తమ పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్లకు ఈనెల 28 చివరి తేదీ అన్నారు.

కొత్త సంవత్సరంలో ప్రజలంతా బాగుండాలి

ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శోభకృత్ నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి కుటుంబమూ ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో నవరత్న పథకాలను అమలు చేస్తున్నారన్నారు. భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి శాయ శక్తులా కృషి చేస్తున్నానని తెలిపారు. తాడేరు వంతెన నిర్మాణానికి సంబంధించి రెండు కోట్ల 30 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. టెండర్ ప్రక్రియ కూడా ముగిసిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శంకుస్థాపనకు ఆలస్యం అయ్యిందన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేసి నాలుగైదు నెలల్లో వంతెన పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక డంపింగ్ యార్డు సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని స్పష్టం చేశారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

భీమవరం ఎఎంసి ఛైర్మన్ బాబు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు తెలిపారు. మండలానికి చెందిన కోటిపల్లి బాబు ఛైర్మన్ అయిన తరువాత మొదటి సారి వీరవాసరం మండల పరిషత్ సమావేశానికి హాజరైన ఆయనను టిడిపి, జనసేన, వైసిపి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల ఎఎంసి చరిత్రలో మొదటిసారి వీరవాసరం మండలానికి ప్రాధాన్యతిస్తూ ఛైర్మన్‌గా తనను నియమించడం పట్ల ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు గుండా రామకృష్ణ, వీరవల్లి చంద్రశేఖర్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, వైసిపి మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గుర్తుతెలీని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు, నిడదవోలు ప్రధాన కాలువలో దిగమర్ర బైపాస్ వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా రూరల్ ఎస్‌ఐ కె.శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. మృతుడికి 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటాయని, అతని శరీరంపై ఎలాంటి దుస్తులు లేవని తెలిపారు. మూడు రోజుల క్రితం చనిపోయి ఉంటారని తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

దుబాయ్‌లో పెన్నాడ వాసి మృతి

కుటుంబ సభ్యులతో వీడియో కాల్ మాట్లాడుతూ ఉరివేసుకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకోడేరు

జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి మాట్లాడుతుండగానే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి ప్రాంతానికి చెందిన గెద్దాడ జగదీష్ (27)కు పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారం కొత్తపేటకు చెందిన గేద్దాడ మానసతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల జాను, మూడేళ్ల అనూష కుమార్తెలు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో 13 నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం జగదీష్ దుబాయ్ వెళ్లాడు. అప్పటి నుంచి పిల్లలతో జగదీష్ భార్య పుట్టిల్లు అయిన పెన్నాడలో ఉంటోంది. అయితే సోమవారం రాత్రి నుంచి ఇద్దరు పిల్లలతో మానస కనిపించట్లేదని మానస కుటుంబ సభ్యులు మంగళవారం పోలీస్ స్టేషన్లు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా జగదీష్ దుబాయ్ నుంచి కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి భార్యను పిల్లలను చూపించాలని కోరాడు. అయితే వారు కనిపించకపోవడంతో మనస్తాపానికి గురైన జగదీష్ మాట్లాడుతుండగానే తనకు అన్యాయం జరిగిందని, మోసం చేశారని కన్నీరుపెట్టుకుంటూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో జగదీష్ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జగదీష్ భార్య మానస వివాహేతర సంబంధం పెట్టుకోవడమే జగదీష్ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది.